
కథ

# సమస్యల బడి సరస్వతీ బడి

- విరించి



"నాన్నా! స్కూలుకెళ్ళను'' అనిరుద్ కలవరిస్తున్నాడు. ఒళ్ళు సలసలా కాగుతోంది. నూట నాల్గు జ్వరం ఉంది. డాక్టర్ ఇచ్చిన మందు వేసినా జ్వరం పూర్తిగా తగ్గడం లేదు.

"వద్దు నాన్నా! స్కూలుకెళ్ళొద్దు'' అనునయంగా కొడుకు తల నిమురుతూ అన్నాడు సుందరరావు. ఎప్పుడూ ఆరోగ్యంగా, హుషారుగా ఉండే అనిరుద్ ఎందుకిలా అయిపోయాడో అర్థం కావడం లేదు.

ఈమధ్య అనిరుద్ అన్యమనస్కంగా ఉంటున్నాడు. ఉదయాన్నే ఏడు గంటలకు స్కూలు వెళ్ళినవాడు రాత్రి ఎనిమిది గంటలకు తిరిగి వస్తాడు. మొదట్లో స్కూలుకు బస్‌లో వెళ్ళేవాడు. బస్ మరీ కిక్కిరిసి ఉండటంతో ఆటోలో వెళ్ళొస్తున్నాడు. వస్తూనే ఉసూరుమంటూ బ్యాగ్, లంచ్ కారియర్ గుమ్మంలో పడేసి సోఫాలో కూలబడతాడు. వాడ్ని సేద దీర్చడాన్కి వాళ్ళమ్మ సావిత్రి అపసోపాలు పడుతుంది.

మార్కులంటే క్లాస్ ఫస్ట్ వస్తున్నాడు గానీ, వాడిలో మునుపటి హుషారు లేదు. ఎప్పుడు బిక్కుబిక్కుమంటూ, జీవితంలో ఏదో కోల్పోయిన వాడిలా ఉంటున్నాడు.

ఉద్యోగరీత్యా బ్యాంకు మానేజర్ అయిన సుందరరావు ఇంతకు ముందు పల్లెటూర్లో ఉండేవాడు. అనిరుద్ జిల్లా పరిషత్ స్కూల్లో సెవెన్త్ క్లాస్ తెలుగు మీడియంలో చదివాడు. ఎపుడూ ఉత్సాహంగా, ఉల్లాసంగా ఆడుతూ పాడుతూ చదువుకునే అనిరుద్ సెవెన్త్ జిల్లా ఫస్ట్ వచ్చాడు ఏనాడూ స్కూలు మానేవాడు కాదు.

ఈమధ్య సిటీకి ట్రాన్స్‌ఫర్ అవడం తన అదృష్టంగా భావించాడు సుందరరావు. ఊళ్ళో ఉన్న అన్ని కార్పొరేట్ స్కూల్సు పరిశీలించి అత్యధిక డొనేషన్ కట్టి 'భాగ్యం' పబ్లిక్ స్కూల్‌లో జాయిన్ చేసాడు. తన కొడుకు ఇంగ్లీషు మీడియంలో చదవడంలేదని, అదీ కార్పొరేట్ స్కూల్లో చదవడం లేదని బాధపడే సుందరరావు కోరిక ఈసారి తీరింది.

ఆ ఆనందం పూర్తిగా అనుభవించకముందే అనిరుద్ "నాన్న! స్కూలుకెళ్ళను'' అని కలవరించడంతో కుదేలయిపోయాడు. ఏనాడూ క్లాస్ ఫస్టుండే

అనిరుద్ ఏనాడూ స్కూల్ మానని అనిరుద్ కేమయ్యింది?

"మీవాడు స్కూలంటే ఎందుకో భయపడ్తున్నాడు. ఆ ఫోబియా పోవాలి. ముందు మీరా భయాన్ని పోగొట్టాలి. అప్పుడు గానీ ఆరోగ్యం కుదుటపడదు" అన్నారు డాక్టర్ కుమార్.

డాక్టర్ కుమార్ ఆ ఊళ్ళో మంచి పేరున్న చిల్డ్రన్ స్పెషలిస్టు.

ఓ వారం రోజులకు నెమ్మదిగా అనిరుద్ జ్వరం తగ్గింది. అనిరుద్ ఒక్కడే కొడుకవడంతో రోజూ సుందరరావు కొడుకుతో పాటే కలిసి స్నానం చేస్తాడు. అనిరుద్ వీపు రుద్దుతూంటే వీపు మీద మచ్చ కనబడింది. సుందరరావుకు.

"ఏమిటి నాన్నా! ఈ మచ్చ!" చేత్తో ఆ మచ్చమీద రుద్దబోతుండగా సుందరరావు,

"అబ్బా! వద్దు నాన్న రుద్దకు" అన్నాడు అనిరుద్ బాధగా.

"అదేమిటి? దెబ్బా? మీ ఫ్రెండ్సు నువ్వు ఫైట్ చేసుకున్నారా?"

"లేదు నాన్నా!"

"మరి?"

"చెప్తానుగానీ, నువ్వు మరి ఎవర్నీ అడగకూడదు"

"ఓ.కె."

"ప్రామిస్"

"ప్రామిస్" అన్నాడు సుందరరావు. అలా అంటే గానీ అనిరుద్ అసలు విషయం బయటకు చెప్పడు.

"సోషల్ టీచర్ కొట్టారు" అనిరుద్ నెమ్మదిగా చెప్పాడు.

"ఎందుకు?" ఆశ్చర్యం, అసహనం రెండూ వచ్చాయి సుందరరావుకు.

"క్వార్టర్లీ మార్కులు తక్కువ వచ్చాయని"

"క్లాస్ ఫస్ట్ నువ్వే కదరా! ఇరవై అయిదుకు ఇరవై మూడు వచ్చాయన్నావ్?"

"ఇరవై అయిదు రాలేదని..."

"నిన్నొక్కడ్నే కొట్టారా టీచర్... ఇంకా ఎవర్నైనా కొట్టారా?"


"అందర్నీ కొట్టారు"

సుందరరావుకు పరిస్థితి అర్థమయ్యింది. మిగతా వాళ్ళకు మార్కులు బాగా రాలేదని కొడ్తే, అనిరుద్‌కు నూరుశాతం రాలేదని కొట్టారు. సుందరరావు ఆవేశం కట్టలు త్రెంచుకుంది.

"ఓ.కే! నేను ప్రిన్సిపాల్‌తో మాట్లాడతాను"

"వద్దు నాన్నా! మళ్ళీ కొడతారు"

"నువ్వేం భయపడకు, బాగా చదువుకో. నిన్నెవరూ కొట్టరు. నేనున్నాను" అనిరుద్‌కు ధైర్యం చెప్పాడు. క్లాస్ ఫస్ట్ వచ్చిన వాడ్ని కొట్టడం తనెక్కడా చూడలేదు. ఆ రోజంతా ఆలోచించాడు ఏం చెయ్యాలని? ఓ నిర్ణయానికి వచ్చి మర్నాడు సాయంత్రం



బ్యాంకులో పని పూర్తిచేసుకొని స్కూలుకు బయల్దేరాడు.

సుందరరావు ప్రిన్సిపాల్ గదిలో అడుగు పెట్టగానే ప్రిన్సిపాల్‌కు విష్ చేసాడు.

''నమస్తే రండి'' అన్నాడు ప్రిన్సిపాల్. సుందరరావు ప్రిన్సిపాల్‌కు ఎదురుగా కూర్చున్నాడు.

అనిరుద్‌ను కొట్టినందుకు సుందరరావుకు చాలా కోపంగా ఉంది. వాడు పుట్టిన ఈ పదమూడు సంవత్సరాల్లో తాను ఏనాడూ కొట్టి ఎరుగడు. సుందరరావు ఆవేశాన్ని అణచుకుంటూ అడిగాడు.

''సర్! మీ కాన్సెప్ట్ ఏమిటి? క్లాస్ ఫస్ట్ వచ్చిన వాడ్ని కొట్టడమేనా? వేలకు వేలు ఫీజులు కడుతున్నది మా పిల్లలు మీచేత కొట్టించుకోడానికా? ఆమాత్రం కొట్టుకోవడం మాకు చేతకాదా? అంతదాన్కి యూనిఫాంవేసి ఆటోలు, బస్‌లు ఎక్కించి, క్యారియర్ ఇచ్చి మీ స్కూలుకు పంపాలా?'' ఇంచుమించుగా సుందరరావు అరచినట్టుగా అన్నాడు.

ప్రిన్సిపాల్ ఏం భయపడలేదు. అతగాడికి ఇలా ఆవేశపడేవాళ్ళని చూడ్డం అలవాటయిపోయింది.

''ఆవేశపడకండి. జరిగింది చెప్పండి'' అన్నాడు కూల్‌గా.

సుందరరావు చెప్పాడు.

ప్రిన్సిపాల్ బెల్ కొట్టి ''ఎయిత్ సోషల్ టీచర్ని, అనిరుద్‌ని పిలు'' అన్నాడు ప్యూన్‌తో. ఐదు నిమిషాల్లో సోషల్ టీచర్, ఆ వెనుక అనిరుద్ వచ్చారు. సుందరరావు కందిపోయిన మొహం చూడగానే ఏం జరిగిందో గ్రహించాడు ఆ సోషల్ టీచర్.

''సోషల్ ఎయిత్‌ఫస్ట్ ఎంతండి?'' అన్నాడు ప్రిన్సిపాల్.

''ట్వంటీ ఫైవ్‌కు ట్వంటీ త్రీ సార్'' వినమ్రంగా చెప్పాడు టీచర్.

''మరి అనిరుద్‌ని ఎందుకు కొట్టారు?''

''సర్! చాలా కష్టపడి చదివించాను సర్. ఇరవై అయిదుకు ఇరవై అయిదు వస్తాయని చెప్పాడు సర్''

''కానీరాలేదు. అందుకుకొట్టారు. అవునా?''

టీచర్ మాట్లాడలేదు.

''ఇదేం మ్యాథ్సా? రాకపోతే కొడతారా? ఇక మీదట అనిరుద్ వంటిమీద ఈగ వాలడానికి వీలు లేదు. తెల్సిందా? ఇక మీరు వెళ్ళండి'' ప్రిన్సిపాల్ చాలా గట్టిగా చెప్పాడు. టీచర్ మౌనంగా వెళ్ళిపోయాడు. టీచర్‌తో పాటు అనిరుద్ వెళ్ళిపోయాడు.

''ఇంకేమిటి? ఎనీ మోర్ ప్రాబ్లెమ్స్'' అన్నాడు ప్రిన్సిపాల్.

''మరో విషయం సార్ మీ బస్ ఫెసిలిటీ సంగతి ఏమిటి? ఇరవై అయిదు సీట్లలో అరవైమందిని ఎక్కిస్తున్నారు. అందుకే బస్ మాన్పించి ఆటోలో పంపిస్తున్నాం. బస్ అయితే సేఫ్టీ అని కదా బస్ ఎక్కించేది. మరో బస్ అరేంజ్ చెయ్యొచ్చుగా?'' అన్నాడు సుందరరావు.

''బస్‌ల వలన సంస్థకు కలిసి వచ్చేదేముండదండీ. ఎవరి ఏర్పాట్లు వాళ్ళే చేసుకోవాలి. క్రిందటేడాది మా స్ట్రెంత్ పన్నెండు వందలు, ఈ సంవత్సరం రెండువేలు. మా స్కూలు కున్న మంచిపేరును బట్టే కదా ఇంతమంది చేరారు'' ప్రిన్సిపాల్ చాలా గర్వంగా చెప్పాడు.

ఇంతలో ఓ పంచె కట్టు మనిషి ప్రిన్సిపాల్ గదిలోకి వచ్చాడు.

''నమస్కారం సార్!'' అన్నాడాయన.

''నమస్కారం రెడ్డిగారూ! బాగున్నారా?'' అన్నాడు ప్రిన్సిపాల్.

''మేం బాగానే ఉన్నాం. మావోడి చదువే బాగా లేదు. మార్కులు మరీ నాసిగా వస్తున్నాయ్'' అన్నాడాయన.

''మీవాడు కాస్త డల్లర్. మరికాస్త లేజీ''

''సరిగా చదవకపోతే నాల్గు తగిలించండి. మీరేం జాలి చూపించక్కర్లేదు''

సుందరరావుకు మాట రాలేదు. తను పిల్లవాడ్ని కొట్టొద్దు అని చెప్పడాన్కి వస్తే, ఈ పెద్దమనిషి నాల్గు తగిలించమంటున్నాడు.

''ప్రొద్దుట్నుంచి రాత్రిదాకా స్కూల్లో వదిలేసేది ఎందుకండీ? ఆడు ఇంట్లో సదవడు, అల్లరీ గట్రా చేస్తాడనే కదా! మాకు చదువు చెప్పడాన్కి రాదు. ట్యూషను గట్రా పెట్టించక్కర్లేదనే కదా!'' అన్నాడు రెడ్డిగారు.

''మీరేం కంగారు పడకండి. నాల్గురోజులు పోతే లైన్లో పడతాడు. క్రమేపీ మంచిమార్కులొస్తాయి. నాదీ బాధ్యత'' ప్రిన్సిపాల్ ధైర్యం చెప్పి రెడ్డిగారిని సాగనంపాడు.

''చూసారా? మాకు ఇలాంటివాళ్ళే ఎక్కువ'' అన్నాడు ప్రిన్సిపాల్.

''ఇది చాలా అన్యాయం. ఆ రెడ్డిగారేదో చదువుకోక అలా అనుంటాడు. పిల్లల్ని కొడితే చదువొస్తుందని మీరు నమ్ముతున్నారా?'' అన్నాడు సుందరరావు.

''మా నమ్మకాలతో ఎవరికీ పనిలేదు సార్. పేరెంట్సు నమ్మకాల కనుగుణంగా మేం నడుస్తాం. ఈ సంవత్సరం మా స్కూలు స్ట్రెంత్ ఆల్‌మోస్టు డబుల్ అయ్యింది. ఎలా అంటారు? ప్రతి పేరెంట్సు పిల్లలికి వాళ్ళు ఇంట్లో చెప్పరు. చెప్పేంత తీరిక, ఓపిక ఉండవు. మా స్కూల్లో పడేస్తే, మేం బాగా తోముతాం. పిల్లవాడు నయానో భయానో చదువుతాడు. పిల్లవాడ్కి మార్కులు బాగా వస్తాయి. అదే వాళ్ళకు కావల్సింది''

''అది సరే! మరి ఆటలు పాటలు, శారీరక వ్యాయామం అక్కర్లేదా? మానసిక ఒత్తిడి గురించి ఆలోచించరా?''

''ఇద్దరు పి.టి.సార్స్ ఉన్నారు. కానీ వాళ్ళకి పిల్లల్ని ఆడించేంత అవకాశం ఉండదు. వారానికి ఒక్కసారి ఉండే గేమ్స్ పిరియడ్ కూడా ఎక్స్‌ట్రా క్లాస్ క్రింద ఏదో ఒక టీచర్ తీసుకుంటారు. ఇక, మానసిక ఒత్తిడి అంటారా ఆమాత్రం భరించక తప్పదు. ఈ పోటీ ప్రపంచంలో. పిల్లల శారీరక ధారుఢ్యం కన్నా వాళ్ళు మార్కులు, ర్యాంక్స్ కదా పేరెంట్సుకు ముఖ్యం'' ప్రిన్సిపాల్ మాటల్లో సెటైర్ ఉన్నా వాస్తవం కూడా అదే కదా!

''ఓ.కే. థాంక్స్'' అని బయటకు వచ్చాడు.

అప్పటికే టైం రాత్రి ఏడయ్యింది. స్కూలు లాంగ్ బెల్ కొట్టగానే పిల్లలందరూ బిలబిలా బయటకు వస్తున్నారు. ఒక్కొక్కళ్ళ భుజాన్న ముప్పై, నలభై కేజీల పుస్తకాల మోత, జైలునుంచి విడుదలైన ఖైదీల ఆనందం వాళ్ళ కళ్ళల్లో, వారం రోజులు పస్తులుంటే ఉండే నీరసం వాళ్ళ కాళ్ళల్లో కన్పిస్తోంది. ఎవరికి వాళ్ళు తమ ఆటోలకోసం, బస్‌లకోసం ఉరుకులు, పరుగులు.

సుందరరావు బయటకు రాగానే అనిరుద్‌తో ఆటోలో వచ్చే ఆదిత్య చేతికి బ్యాండేజీతో కన్పించాడు. హడావుడిగా వెళ్తున్న వాడ్ని సుందరరావు చేత్తో ఆపాడు.

''ఆదిత్యా! అనిరుద్ ఏడీ? అన్నాడు

''ఫోర్త్ ఫ్లోర్ కదా సార్. లిఫ్ట్ లేదు కదా! టైం పడుతుందండీ'' అన్నాడు ఆదిత్య.

''ఆ కట్టేమిటీ? ఏమైనా ఎడ్వంచర్ చేసావా?''

''మీకు అనిరుద్ చెప్పలేదా అంకుల్?'' తిరిగి ప్రశ్నించాడు ఆదిత్య

''లేదే''

''సైన్స్ టీచర్ కొట్టారు. ఫ్రాక్చర్ అయ్యింది''

సుందరరావు షాక్ అయ్యాడు. టీచర్ కొడ్తే చెయ్యి విరగడమా?



''మీ డాడీ ఏం చేస్తారు? ఏమన్నారు?''

''మా డాడీ పోలీస్ డిపార్టుమెంటులో చేస్తారు సార్. వచ్చి అడిగారు. ప్రిన్సిపాల్‌గారు టీచర్ని జాబ్ నుండి రిమూవ్ చేస్తామన్నారు. కడుపుమీద కొట్టడం ఎందుకని మా డాడీ ఆ టీచర్ రెండు నెలల జీతం కట్ చేసి నా ట్రీట్‌మెంట్ చేయించమన్నారు''

సుందరరావుకు మరింత ఆశ్చర్యమేసింది. కొడుకు చెయ్యి విరక్కొడితే అది కూడా 'ఎన్‌క్యాష్' చేసుకున్నాడా పోలీసాయన. దాన్కి కాంపెన్సేషన్‌గా ఇంకా ఏదో ముట్టే ఉంటుంది. అంత తేలిగ్గా వదులుతాడా పోలీసాఫీసరు. రేపొద్దున మరో టీచర్ బుర్ర బద్దలు కొట్టి నాలుగు నెలలు శాలరీ ఇస్తాడు.

''ఓ.కె! నాన్నా! జాగ్రత్తగా వెళ్ళు'' ఆదిత్యను పంపించేసాడు.

అనిరుద్ కోసం ఓ ప్రక్కగా నిలబడి చూస్తున్నాడు సుందరరావు, ఓ పావుగంటకు పుస్తకాల బస్తా మోసుకుంటూ నాలుగు అంతస్థులు రొప్పుకుంటూ దిగుతూ ఆటో దగ్గరకు వెళ్తున్నాడు. చాలామంది పిల్లలు అప్పట్కే ఆటోలు, బస్‌లు ఎక్కేసారు. మొదట్లో అనిరుద్ స్కూలు బస్‌లో వెళ్ళడంతో బస్ డ్రయివర్ నారాయణ, సుందరరావును గుర్తుపట్టి విష్ చేసాడు.

''ఏం నారాయణ? బస్‌లో పిల్లలు ఏమైనా తగ్గారా? బస్ అయితే సేఫ్టీ కదా అని రోజూ అనుకుంటుంటాం'' అన్నాడు సుందరరావు.

''ఏం సేఫ్టీ సార్? మేం పిల్లల్ని దృష్టిలో పెట్టుకొని జాగ్రత్తగా నడుపుతాం. స్కూలు వాళ్ళు డబ్బులు దృష్టిలో పెట్టుకొని ఇరవై అయిదు సీటర్‌కు అరవైమందిని ఎక్కిస్తారు. బండి కండిషన్‌లో ఉండదు. పాతికేళ్ళ క్రితం బస్. కన్‌డెమ్ అయ్యింది. రంగులేసి సోకులు చేస్తారు. పట్టించుకునే నాథుడు లేడు. మొన్నటికి మొన్న బ్రేక్స్ ఫెయిల్ అయి పెద్దగండం తప్పింది'' నారాయణ మేనేజ్‌మెంట్ మీద ఉన్న అసంతృప్తినంతా వెళ్ళగ్రక్కాడు.

''అదేమిటి? రిపేర్లు గట్రా చేయించరా?'' అన్నాడు సుందరరావు.

''వాటికి వయస్సయిపోయింది సార్! రోడ్‌మీద నడిచే బళ్ళు కాదుసార్, వస్తాను సార్. టైం అయింది'' అంటూ వెళ్ళిపోయాడు.

సుందరరావు వెనక్కి చూసాడు. అనిరుద్ ఆటో ఎక్కాడు. ఆ ఆటోలోకూడా పదిమంది ఉన్నారు.

''నమస్కారం సుందరరావుగారు'' ఎవరో పలకరిస్తే అటు తిరిగాడు సుందరరావు. వాళ్ళ అపార్ట్‌మెంటు కింద ఫ్లాట్‌లో ఉండే బాలగంగాధరతిలక్. మంచి విద్యావంతుడు. సోషల్ వర్కర్. అందరూ బిజీ తిలక్ అంటారు. ఎప్పుడూ ఏదో సమస్యలపై పోరాడుతూ బిజీగా ఉంటాడు.

''నమస్తే! ఏమిటి మీ బాబును తీసుకెళ్ళడాన్కి వచ్చారా?'' అన్నాడు సుందరరావు.

''కాదండీ, మాదో విచిత్రమైన సమస్య. క్లాస్‌కు నలభై మంది యాభై మంది పిల్లల్ని కూరుతున్నారు. ఒక్కటే ఫాన్. గాలి ఆడదు. ఆఖర్ని వెనక కూర్చోపెట్టడం వల్ల మావాడ్కి బోర్డు సరిగా కనపడదు. టీచర్ మాట స్పష్టంగా వినపడదు. మార్కుల్లో వెనకబడుతున్నాడు. ప్రిన్సిపాల్‌కు చెప్తే 'మీవాడు పొడుగు అందుచేత వెనకాల కూర్చోబెట్టాం' అంటాడు.''

''మంచి స్కూల్ కావాలి. ఈ పోటీ ప్రపంచంలో ముందుండాలి. అయితే ఇవన్నీ తప్పవు'' అన్నాడు సుందరరావు.

''ఏం మంచి స్కూల్ సార్! మున్సిపాల్టీ స్కూల్లో అందరూ క్వాలిఫైడ్ టీచర్లే. ఇక్కడంతా బొడ్డూడని వాళ్ళే. ఏం? మనమంతా మున్సిపాల్టీ స్కూల్లో చదివిన వాళ్ళం కాదా! మన కలెక్టర్‌గారు కూడా మున్సిపాలిటీ స్కూల్లో చదివినవారే'' అన్నాడు తిలక్ ఆవేశంగా.

''మీరు చెప్పేది కరెక్టేగానీ, ఈ ఐ.ఐ.టి టాలెంటు స్కూలు, కాన్సెప్ట్ స్కూలు, మెక్నో స్కూలు అప్పుడు లేవు కదా?'' అన్నాడు సుందరరావు.

''అలా అని మన పిల్లల్ని ఈ కార్పొరేట్ స్కూల్ మాన్పిద్దామా?'' అన్నాడు సుందరరావు.

''కార్పొరేట్ స్కూల్సు చెప్పే మానసిక వికాసం, కాన్సెప్ట్, టాలెంటు ఇవన్నీ కాగితాలు, ఫ్లెక్సీ బోర్డుల మీద ఉంటాయి సార్! కొద్దిమంది మెరిట్ స్టూడెంట్సును పట్టుకోవడం, వాళ్ళని పగలు రాత్రి ఊదరగొట్టి ర్యాంకులు సాధించడం, అవి గొప్పగా పేపర్లలో ఫుల్‌పేజీ వేసుకొని వ్యాపారం చేసుకోవడం ఇదీ కార్పొరేట్ సంస్కృతి'' ఆవేశంగా అన్నాడు తిలక్.

''లేకపోయినా అప్పటివాళ్ళు డాక్టర్లు, ఇంజనీర్లు, కలెక్టర్లు కాలేదా? అప్పుడే పుట్టిన వాడికి కూడా ఐ.ఐ.టి. టాలెంట్ స్కూలంటారు. వీళ్ళలో ఎంతమంది ఐ.ఐ.టికి సెలెక్ట్ అవుతున్నారు? నిజానికి ఐ.ఐ.టి కి ఓ సిలబస్ ఉందా? పిల్లల్ని సెంట్రల్ స్టేట్ సిలబస్ కలగలిపి నూరి కషాయంలా త్రాగించడం తప్ప వాళ్ళు చేస్తున్నదేమిటి సార్? ఆ పేరుతో దోపిడీ చెయ్యడం తప్ప?''

''అలా అని మన పిల్లల్ని ఈ కార్పొరేట్ స్కూల్ మాన్పిద్దామా?'' అన్నాడు సుందరరావు.

''కార్పొరేట్ స్కూల్సు చెప్పే మానసిక వికాసం, కాన్సెప్ట్, టాలెంటు ఇవన్నీ కాగితాలు, ఫ్లెక్సీ బోర్డుల మీద ఉంటాయి సార్! కొద్దిమంది మెరిట్ స్టూడెంట్సును పట్టుకోవడం, వాళ్ళని పగలు రాత్రి ఊదరగొట్టి ర్యాంకులు సాధించడం, అవి గొప్పగా పేపర్లలో ఫుల్‌పేజీ వేసుకొని వ్యాపారం చేసుకోవడం ఇదీ కార్పొరేట్ సంస్కృతి'' ఆవేశంగా అన్నాడు తిలక్.

''మరేం చేద్దామంటారు?'' కుతూహలంగా అడిగాడు సుందరరావు.

''ఏం చేద్దామన్నదాన్కి నా దగ్గర మంచి ఆలోచన ఉంది. మీరు సహకరిస్తే..'' అన్నాడు తిలక్.

''తప్పకుండా''

''మనలాంటివాళ్ళు నలుగురం కలెక్టర్‌ను, మున్సిపల్ కమిషనర్‌ను, స్కూలు హెడ్మాష్టర్‌ను, మున్సిపాలిటీ స్కూలు టీచర్లను కలుద్దాం. ఓ మోడల్ స్కూల్ తయారు చేయమని, మన వంతు పూర్తి సహకారమందిస్తామని చెబుదాం. ఆ సంవత్సరం బాగా కృషి చేసిన ఉపాధ్యాయులకు, మంచి మార్కులు తెచ్చుకున్న విద్యార్థులకు నగదు బహుమతిలిద్దాం'' అన్నాడు.

తిలక్ మాటలు సుందరరావుకు ఆనందం కలిగించాయి. తన మనస్సులో అసందిగ్ధంగా ఉన్న భావాలకు ఓ సరైన రూపాన్నిచ్చినట్లుగా అన్పించింది.

గట్టిగా తిలక్ చెయ్యి నొక్కి అభినందించాడు.

''మీ మాటలు నాకు చాలా నచ్చాయి. తప్పకుండా మీరన్నట్లు చేద్దాం. ఈ ఇరుకిరుకు గదులలో జైలును తలపించే స్కూల్లో, ఆటపాటలు లేకుండా, వయస్సుకు మించిన వత్తిడితో, రోజుకు పన్నెండు గంటల చదువంటే 'శిక్ష' గానీ, 'శిక్షణ' కాదు. బాల్యం అనేదే లేకుండా, ఎండపొడే సోకకుండా వాళ్ళకు చేస్తున్న అన్యాయాన్ని ఈవిధంగా అయినా అరికట్టొచ్చు'' అన్నాడు సుందరరావు ఉత్సాహంగా.

తన కొడుకు అనిరుద్ 'నాన్నా! స్కూలుకెళ్ళను' అని ఎందుకన్నాడో సుందరరావుకు బాగా అర్థమయ్యింది. దానికి పరిష్కారమూ దొరికింది

మర్నాడే సుందరరావు, తిలక్ మరో నలుగురు మిత్రులతో కలెక్టర్‌ను కలిసి అన్నీ వివరించారు. కలెక్టర్‌గారు తనవంతు సహాయం చేయడమే కాకుండా, ఊహించని విధంగా ఆయన కొడుకును కూడా మున్సిపాలిటీ స్కూల్లో జాయిన్ చేస్తానని హామీ ఇచ్చారు. కలెక్టర్ హామీతో పొందిన ఉత్సాహంతో కమిషనర్‌ను, స్కూలు హెడ్మాష్టరును, టీచర్లను కలిసారు. వాళ్ళ పిల్లల్ని కూడా జాయిన్ చెయ్యడాన్కి అంగీకరింపజేసారు. ఎప్పుడైతే కలెక్టర్ గారబ్బాయి జాయిన్ అవుతున్నాడో ఆర్డీవోగారబ్బాయి తహసీల్దారుగారి అమ్మాయి జేరారు. గాంధీనగరం మున్సిపల్ హైస్కూలుకు కొత్త కళ వచ్చింది. మున్సిపల్ స్కూలులో చదివి ఐ.ఎ.యస్. అయినవాళ్ళు డాక్టర్లు, ఇంజనీర్లు అయినవాళ్ళ అందరి చిరునామాలు సేకరించి 'పూర్వ విద్యార్థుల సమావేశాన్ని' ఏర్పాటు చేసారు. సమస్యలన్నీ లిస్ట్ అవుట్ చేసారు. అందరి సహకారంతో, స్వచ్ఛంద సంస్థలు తల్లిదండ్రుల భాగస్వామ్యంతో స్కూలులో మంచి వసతులు, వాతావరణం ఏర్పరిచారు. హెడ్మాష్టర్‌కు కొత్తబాధ్యత వచ్చింది. టీచర్లంతా స్కూలు అభివృద్ధికోసం మంచి ఫలితాల కోసం, పనిచేయాలనే సంకల్పం, నిబద్ధత అలవర్చుకున్నారు. పట్టుదల, అంకితభావం ఉండాలేగానీ సాధించలేనిది ఏమీ లేదని మరోసారి ఋజువయ్యింది. ఒక్క చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడటంలో పిల్లల్లో, తల్లితండ్రులలో మున్సిపాల్టీ స్కూలు అంటే ఉన్న చిన్నచూపు పోగొట్టగలిగారు. స్కూలులో శిక్షలు లేవు 'శిక్షణే'గాని. ప్రజల్లో చైతన్యం, పర్యవేక్షణ ఉంటే ప్రతి సమస్యకు మున్సిపాలిటీ బడి ఓ సరస్వతి ఒడే. ఈరోజు గాంధీ నగరం మున్సిపల్ హైస్కూల్లో సీట్లు రానివాళ్ళే కార్పొరేట్ స్కూలు గడప తొక్కుతున్నారు.

*

**చిరునామా**

**తల్లాప్రగడ గోపాలకృష్ణ**

**యస్-5, శివ అపార్టుమెంట్సు,**

**చావలివారి వీధి, గాంధీనగరం,**

**కాకినాడ - 533 004**

**సెల్ : 9848789094**